క్లుప్తంగా

అంబేడ్కర్‌కు నివాళి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో మండల లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో మంగళవారం లా డే, యాంటీ డౌరీ డే, భారత రాజ్యాంగ పరిషత్ దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి శోభారాణి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం న్యాయమూర్తులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం విశిష్టత, చట్టాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, న్యాయవాదులు సత్య శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, సంతోష్, గోనెల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, నరసింహారావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



పెనుగంచిప్రోలు: సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయని ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం, కె.పొన్నవరం గ్రామాల్లో అమ్మనాన్న సోషల్ సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పేదలు, వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలని సూచించారు. ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డోర్నాల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి లక్ష తులసీ పూజ



పెనుగంచిప్రోలు: కార్తికమాసం బహుళ ఏకాదశి సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామి వారికి లక్షతులసీ పూజ నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు, కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్షతులసీ పూజ, సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు, తీర్థప్రసాదాల వినియోగం చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, వంశంపారంపర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



పెనుగంచిప్రోలు: భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్, పేర్కొన్నారు. స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో మంగళవారం చతుర్వేద సభ నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 22మంది వేద పండితులు 4వేదాలను పఠనం చేశారు. వేదాల గొప్పతనం, వేద పఠనంతో కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం పండితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేదపండితులు విజయవాడకు చెందిన కూచిభట్ల నరసింహమూర్తి శర్మ, అమరావతికి చెందిన మహంకాళి గౌతమ్‌శర్మ, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీకి చెందిన బలభద్ర ఉపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం



నందిగామటౌన్: స్థానిక వాసవీ మార్కెట్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 500 మంది దంపతులు పాల్గొని సామూహిక కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరులపాడు మండలం నరసింహారావుపాలెం గ్రామానికి చెందిన అగస్త్య పీఠాధిపతి సుగుణానంద మహర్షి చేసిన భక్తి ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోటి దీపోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు గౌరుపెద్ది రామకష్ణ శేషసాయి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భారత రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేశారని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యనారాయణపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్దేశాలను చిత్తశుద్ధితో అమలు చేయడం, ప్రతి పౌరునికి రాజ్యమే వ్యత్యాసాలులేని స్వేచ్ఛ కల్పించడం, సామాజిక ప్రజాస్వామ్యాన్నే రాజకీయ ప్రజాస్వామ్యంగా అవతరింపజేయాలన్న అంబేడ్కర్ సూచనలను జగనన్న అమలుచేశారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి రాజ్యాంగం దోహదపడుతోందని కొనియాడారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు బూడిద నరసింహారావు, చౌడవరపు జగదీష్, వట్టెం మనోహర్, బద్దూనాయక్, ఫిరోజ్‌ఖాన్, నంబూరి రవి, మండవ శ్రీనివాసగౌడ్, సత్యశ్రీనివాస్, పింగళి నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వేముల మల్లేశ్వరరావు, గోగుల వెంకయ్య, దొంగల జానకి, నాగబాబు పాల్గొన్నారు.

కేవీఆర్ పాఠశాలలో..

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం కె జలజ, టీచర్లు పాల్గొన్నారు.

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వరరావు, కారల్ మార్క్స్, పుల్లమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో....

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి మాట్లాడుతూ రాజ్యంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను దేశ ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



పేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్లు



పేట జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, విద్యార్థులు, టీచర్లు, నాయకులు

దేశ సమైక్యతలో రాజ్యాంగం పాత్ర కీలకం

పెనుగంచిప్రోలు: దేశ ప్రజలందరినీ సమైక్యంగా ఉంచడంలో భారత రాజ్యంగం కీలకపాత్ర పోషిస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగం విశిష్టత, అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి శ్రీను, ఈఓపీఆర్‌డీ కేవీ సుబ్బారావు, ఏఓ సిద్ధారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మునిబోయిన శివకృష్ణ, కీసర లోకేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని అనిగండ్లపాడు ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శెట్టిపోగు రాము, ఉపాధ్యాయురాలు ఆసియా పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

లైమ్‌స్టోన్ మైన్స్ టౌన్‌షిప్ వద్ద..

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైమ్‌స్టోన్ మైన్స్ టౌన్‌షిప్ వద్ద రాజ్యాంగ దినోత్సవం వేడుకలను ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు రామచందర్‌నాయక్ అధ్యక్షత వహించగా, మైన్స్ ఇన్‌చార్జ్ నాగరాజు, అసోసియేషన్ కార్యదర్శి డి.విజయకుమార్, సభ్యులు వెంకటేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, డాక్టర్ దీపంకర్, రామకృష్ణ, కాంట్రాక్టు కార్మికులు, డీఏవీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: 75వ రాజ్యాంగ దినోత్సవం వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆనందసాయి ఆలయం వద్దనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్‌లో జరిగిన మన్‌కీ బాత్ వేడుకల్లో భాగంగా విద్యార్థులతో కలసి 100 అడుగుల జెండా ర్యాలీలో పాల్గొన్నారు. జెండాను ఆవిష్కరించి, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం మాధవీలత, విద్యా కమిటీ చైర్మన్ అనురాధ, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జగ్గయ్యపేట మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడీవో జి.నితిన్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి రాజ్యాంగ ప్రతిజ్ఞ చదివారు. రాజ్యాంగ రచన కోసం అంబేడ్కర్ చేసిన కృషిని కొనియాడారు. అదేవిధంగా ఆయా ప్రభుత్వ పాఠాశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. గండ్రాయి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నందిగామ పట్టణ, మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ పలువురు నాయకులు పాల్గొన్నారు. చందాపురం ఎంపియుపి పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయసేవాధికాసంస్థ ఆధ్వర్యంలో..

కంచికచర్ల: నందిగామ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నండ్రుబాబూ విద్యాసాగర్ అధ్యక్షతన మంగళవారం రాజ్యాంగ, జాతీయ న్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం ముఖ్యఅతిథిగా హాజరైన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ గొప్ప రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ అద్దంకి మణిబాబు, సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు, సీనియర్ న్యాయవాదులు తుర్లపాటి మార్కొండేశ్వరరావు, షేక్ కరీముల్లా, ఏజీపీ మట్టా ప్రసాద్, కన్నెకంటి జీవరత్నం, బండారు సుభాకర్, సంగమేశ్వరశర్మ, మన్నెం నారాయణరావు, గింజుపల్లి రమేష్, చాపల శివరామకృష్ణ, గుర్రాల వెంకటరత్నం, కొమ్మినేని మాశేశ్వరరావు, షేక్ సైదా పాల్గొన్నారు.



నందిగామలో ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి లక్ష్మీరాజ్యం, న్యాయవాదులు



కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో ..



పేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు



చందాపురంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను తదితరులు



అనిగండ్లపాడులో నివాళులర్పిస్తున్న హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు



పెనుగంచిప్రోలు కేవీఆర్ పాఠశాల వేడుకల్లో...



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కంచికచర్ల ఎంపీడీవో విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ హఫీజ్ షేక్ అహ్మద్



నందిగామ బార్ అసోసియేషన్‌లో బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం: తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను కూడా పథకాలుగా రూపొందించి అమలుచేశారని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుకు నోచుకోక పోగా, విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారులను దారుణంగా దగా చేశారని ఆరోపించారు.కూటమి ప్రభుత్వం సబ్సిడీలు భరించేందుకు నిరాకరిస్తూ వినియోగదారులపై నిర్దాక్షిణ్యంగా రూ.17 వేల కోట్ల భారం మోపిందన్నారు. సంపద సృష్టిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టిలో సంపద సృష్టిస్తామంటే విద్యుత్ చార్జీలు, యూజర్ చార్జీలు, టోల్‌చార్జీలతో ప్రజల నడ్డి విరగగొట్టడమేనా అని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ ఢీకొని రైతుకు తీవ్రగాయాలు



చందర్లపాడు(కంచికచర్ల): ఇసుక టిప్పర్ ఢీకొనడంతో ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన చందర్లపాడు మండలంలోని కాసరబాద గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డీ చవాన్ కథనం మేరకు కాసరబాద ఇసుక రీచ్ నుంచి విజయవాడకు ఇసుకను తరలిస్తున్న టిప్పర్, పశుగ్రాసం కోసుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న గ్రామానికి చెందిన నంద్యాల రామిరెడ్డి అనే రైతును ఢీకొట్టింది. అనంతరం అతని కాలుపై టిప్పర్ వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న స్థానికులు క్షతగాత్రుడిని వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామస్తుల ఆందోళన...

టిప్పర్ ఢీకొనడంతో రైతు రామిరెడ్డి తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళన చేశారు. ఇసుక టిప్పర్ల రాకపోకలను అడ్డుకున్నారు. ఇసుక రీచ్ కారణంగా లారీల రాకపోకలు పెరిగి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే కాసరబాద ఇసుక రీచ్‌ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

నందిగామటౌన్: పత్తి రైతుల ఆత్మహత్యలతో ప్రారంభమైన అన్నదాతల ఆత్మహత్యల పరంపర నేటికీ కొనసాగుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజాసంఘాల నాయకులు మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరలు సరిగా లేక సన్నచిన్నకారు, కౌలురైతులు అవస్థలు పడుతున్నారన్నారు. బడ్జెట్‌లలో ప్రవేశపెట్టే రూ.లక్షల కోట్ల నిధులు పారిశ్రామికవేత్తలకు చేరుతున్నాయి తప్ప రైతులకు అందడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు కమల, చంద్రశేఖర్, హనుమంతరావు, కోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాగు కల్వర్టులు



ముండ్లపాడు వెళ్లే రహదారిలో చెరువు కట్ట వద్ద చప్టా దుస్థితి



శనగపాడు వద్ద వాగు కల్వర్టుపై ఏర్పడిన గుంత

పెనుగంచిప్రోలు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రహదారులపై ఉన్న వాగు కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదలకు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో రహదారులతోపాటు కల్వర్టులు కూడా దారుణంగా దెబ్బతిన్నాయి. దీంతో ఈకల్వర్టుల వద్ద తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయితే వాహనదారులు ఈకల్వర్టులపై ప్రయాణించాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. కల్వర్టుల వద్ద ఆదమరిస్తే పెద్ద ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా పెనుగంచిప్రోలు నుంచి విజయవాడ వెళ్లే రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే చెరువుకట్ట అలుగులు వద్ద చప్టా మొత్తం వరదకు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మట్టిపోసి మరమ్మతులు చేశారు. అయితే అక్కడ కార్లు సంపు తగిలి పాడవుతున్నాయని, కిందపడి గాయాలపాలవుతున్నామని ద్విచక్రవాహనదారులు చెబుతున్నారు.

కల్వర్టు చప్టా పూర్తిగా ధ్వంసం..

అదేవిధంగా శనగపాడు నుంచి అనాసాగరం వెళ్లే దారిలో వాగుపై కల్వర్టు చప్టా మొత్తం ధ్వంసం కావడంతోపాటు గుంతలు పడి మధ్యలో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఇక ముచ్చింతాల నుంచి తాళ్లూరు వెళ్లేదారి, పెనుగంచిప్రోలు నుంచి అనిగండ్లపాడు వెళ్లేదారిలో కల్వర్టుల వద్ద రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం దినదినగండంలా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా కల్వర్టుల వద్ద శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు చేపట్టామని, అనుమతులు వచ్చిన వెంటనే శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపడతామని వివరించారు.

కల్వర్టులు నిర్మించాలి...



వరదల కారణంగా మండలంలోని ఆయా వాగులపై ఉన్న కల్వర్టులు బాగా దెబ్బతినడంతో నిత్యం చిన్నచిన్న ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఆయా కల్వర్టుల వద్ద ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నూతన కల్వర్టుల నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలి.

– కన్నమాల శామ్యూల్, సచివాలయాల మండల కన్వీనర్, తోటచర్ల

తక్షణం మరమ్మతులు చేపట్టాలి...



పెనుగంచిప్రోలు పవిత్ర పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. రహదారులు మాత్రం గోతులమం కాగా, కల్వర్టు సైతం వరదలకు ధ్వంసమయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– కొత్తపల్లి పెంటయ్య, అనిగండ్లపాడు

సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష

జగ్గయ్యపేట: గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆదేశించారు. పట్టణంలోని కోదాడ రోడ్డులో ఉన్న ఎస్‌సీ వసతి గృహంలో మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తక్కెళ్ళపాడు, రామచంద్రునిపేట, అనుమంచిపల్లి గ్రామాల్లోని సమస్యలపై మంగళవారం ఆయన అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పది సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. షేర్‌మహ్మద్‌పేటలోని చెరువు వద్ద ఉన్న తాగునీటి బావికి మెస్ లేకపోవడంతో నీరు కలుషితమవుతోందన్నారు. అడ్డరోడ్డు వద్ద డ్రెయినేజీ లేకపోవడంతో వర్షాకాలంలో మూడడుగుల వరద నీరు నిలిచి ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీలు, గృహాలు మంజూరు కావాలంటూ సమస్యలను అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నిధులు మంజూరుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని మండల స్థాయి అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట తహశీల్దార్ మనోహర్, ఎంపిడీవో జి.నితిన్, ఎస్‌సీ ఈఈ సంతోష్ రాథోడ్, పంచాయితీరాజ్, హౌసింగ్, ఉపాధి హామీ పథకం అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

వాహనాల తనిఖీ

జగ్గయ్యపేట: పట్టణంలోని పాత మున్సిపల్ సెంటర్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వర్లు మంగళవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇద్దరు మైనర్ల తల్లిదండ్రులకు సీఐ ప్రత్యేకంగా ఫోన్ చేసి మాట్లాడారు. ఇలా మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం తగదని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై ఆర్.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై జి.రాజు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అనిల్ హెచ్చరించారు. అల్లూరు సమీపంలో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ అనిల్ మాట్లాడుతూ వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఆటోడ్రైవర్లకు సూచించారు. తగిన ధ్రువీకరణపత్రాలు లేని పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంచికచర్ల: చందాపురం 132కేవీ, 33 కేవీలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవై కొండలరావు మంగళవారం తెలిపారు. కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

ఆరోగ్య సంరక్షణలో జీవనశైలి ఎంతో కీలకం

నందిగామటౌన్: శరీర ధార్మిక స్వభావాన్ని అంచనా వేయడంలో దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్ అభియాన్ యాప్ సహాయపడుతుందని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ పేర్కొన్నారు. దేశ్‌కా ప్రకృతి పరిరక్షణ్ యాప్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఆహారపు అలవాట్లు, జీవనశైలి కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.